న్యూస్‌రీల్

ప్రజలకు మాజీ మంత్రి దీపావళి శుభాకాంక్షలు


మాజీమంత్రి జగదీష్‌రెడ్డి

సూర్యాపేటటౌన్ : చీకటిని పారదోలే వెలుగుల పండుగ దీపావళి అని, దీపాల కాంతుల వలె తెలంగాణలోని ప్రతి ఇంటా వెలుగులు నిండాలని మాజీమంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన సాక్షితో మాట్లాడుతూ దీపావళి పండుగ సందర్భంగా ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దీపావళి పండుగను జరుపుకుంటామన్నారు. దీపాల వెలుగులు మనలో అజ్ఞానాంధకారాన్ని తొలగించి, చైతన్యాన్ని రగిలించాలన్నారు.

పండుగను సంతోషంగా జరుపుకోవాలి : ఎస్పీ



సూర్యాపేటటౌన్ : దీపావళిని పురస్కరించుకొని బాణసంచా, టపాసులు పేల్చే సమయంలో పిల్లలు, పెద్దలు జాగ్రత్తలు పాటిస్తూ పండుగను సంతోషంగా జరుపుకోవాలని ఎస్పీ నరసింహ సూచించారు. జిల్లా ప్రజలందరికీ పోలీస్ శాఖ తరఫున ఆదివారం ఆయన ఒక ప్రకటనలో పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఉత్సవాల పేరుతో ఇతరులను ఇబ్బందులకు గురిచేయొద్దని, మహిళలను గౌరవించాలని పేర్కొన్నారు. బాణాసంచా తయారీదారులు, విక్రయదారులపై నిఘా ఉంచామని తెలిపారు.

పోరాట యోధుడు ధర్మభిక్షం

సూర్యాపేట అర్బన్ : గీత కార్మికుల సంక్షేమ కోసం అహర్నిశలు పోరాడిన యోధుడు ధర్మభిక్షం అని గీత పనివారల సంఘం రాష్ట్ర కార్యదర్శి బొమ్మగాని శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి కొండ కోటయ్య అన్నారు. ఆదివారం సూర్యాపేటలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన ఆ సంఘం 68వ వార్షికోత్సవానికి వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా గీత పనివారల సంఘం వ్యవస్థాపకుడు, మాజీ ఎంపీ, దివంగత నేత బొమ్మగాని ధర్మభిక్షం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ధర్మభిక్షం వర్ధంతి, జయంతిని అధికారంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో దోరపల్లి శంకర్, పాలకూరి బాబు, బందారు లక్ష్మయ్య, పాలకూరి బాబు, దోరపల్లి శంకర్, బూర వెంకటేశ్వర్లు, బూర సైదులు, పెద్దపోలు విష్ణు, ఎడెల్లి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

దేశ సమైక్యతకు ఆర్‌ఎస్‌ఎస్ కృషి


ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలతో మాజీ ఎమ్మెల్యే సంకినేని వెంకటేశ్వరరావు

తుంగతుర్తి : దేశ సమైక్యతకు ఆర్‌ఎస్‌ఎస్ ఎంతో కృషిచేస్తోందని తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే సంకినేని వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం తుంగతుర్తిలో నిర్వహించిన ఆర్‌ఎస్‌ఎస్ శతజయంతి ఉత్సవాల్లో మాట్లాడారు. ముందుగా స్థానిక మెయిన్ రోడ్డుపై ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

వెలుగు దివ్వెల పండుగ

నేడు దీపావళి పర్వదినం

- నోములు, వ్రతాలకు సిద్ధమైన ప్రజలు
- మార్కెట్‌లో పూలు, ప్రమిదల కొనుగోలు
- టపాసుల దుకాణాలు కిటకిట
- అధిక ధరలతో జనం బెంబేలు
- అంతటా సందడి వాతావరణం


సూర్యాపేటలో పూలు కొనుగోలు చేస్తున్న మహిళలు



భానుపురి (సూర్యాపేట) : చీకటిని పారదోలి వెలుగులు నింపే దీపావళి రానే వచ్చింది. జిల్లావ్యాప్తంగా సోమవారం ఆనందంగా పండుగ జరుపుకునేందుకు జిల్లా ప్రజలు సన్నద్ధమయ్యారు. ప్రధానంగా మహిళలు నోములు, వ్రతాల కోసం ఏర్పాట్లు చేసుకున్నారు. ఇందుకు కావాల్సిన అన్నిరకాల సామగ్రిని ఆదివారమే కొనుగోళు చేసుకున్నారు. ఈ క్రమంలో సూర్యాపేట జిల్లాకేంద్రంలోని రహదారులన్నీ జన సంచారం, వాహనాల రాకపోకలతో కిటకిటలాడాయి. పండుగ కోసం పట్టణాల నుంచి పల్లెలకు చేరే ప్రజలతో ఆర్టీసీ బస్టాండ్లు రద్దీగా మారాయి. ఇక నోములు, వ్రతాల కోసం ప్రమిదలు, పూలు, బొమ్మలు, ఇతర సామగ్రి కొనుగోళ్లతో ప్రధాన సెంటర్లలో పండుగ సందడి నెలకొంది. అలాగే కోదాడ, తుంగతుర్తి, హుజూర్‌నగర్, తిరుమలగిరి పట్టణాలు, మండల కేంద్రాల్లోని ప్రధాన రహదారుల్లో పండుగ వాతావరణం సంతరించుకుంది.

కిటకిటలాడిన టపాసుల దుకాణాలు

దీపావళి పండుగ సందర్భంగా ప్రజలు పెద్ద ఎత్తున బాణసంచా కాల్చుతుంటారు. ఇందుకోసం వేలాది రూపాయలను వెచ్చిస్తారు. ప్రజల అభిరుచి మేరకు బాణసంచా వ్యాపారులు భారీగా టపాసులు, క్రాకర్స్ దిగుమతి చేసుకుంటారు. విక్రయానికిగాను ప్రత్యేక దుకాణాలను ఏర్పాటు చేస్తుండగా.. ఈ యేడు సూర్యాపేట జిల్లాకేంద్రంలోని ఎస్వీ డిగ్రీ కళాశాల మైదానంలో ప్రత్యేకంగా దుకాణాలను ఏర్పాటు చేసి వ్యాపారులకు కేటాయించారు. ఈ దుకాణాలకు ఉదయం నుంచే సూర్యాపేట పట్టణమే కాకుండా చుట్టపక్కల గ్రామీణ ప్రాంతాల నుంచి జనం వచ్చి టపాసులను కొనుగోలు చేస్తున్నారు. ఈ క్రమంలో సాయంత్రం నుంచి టపాసులు దుకాణాలు కిటకిటలాడాయి.

అన్నింటికీ ఎక్కువే..

దీపావళి అంటేనే నోములు, వ్రతాలకు ప్రసిద్ధి. ఈ సందర్భంగా లక్ష్మీదేవీకి పూజలు చేయడం ఆనవాయితీ. ఈ క్రమంలో ప్రమిదల కొనుగోలు చేసేందుకు మహిళలు ఆసక్తి చూపగా.. జిల్లా కేంద్రంతోపాటు ప్రధాన పట్టణాల్లోని రహదారులు వెంట ఏర్పాటుచేసిన దుకాణాల్లో పూజ సామగ్రికి అధిక ధరలు ఉన్నాయి. చిన్నవి డజన్ ప్రమిదలు దాదాపు రూ.100ల వరకు విక్రయించారు. పెద్దవి నాలుగింటికి రూ.80 వరకు ధర పలుకుతుంది. పూజ కోసం వాడే పూలు సైతం ఒక మూర రూ.50 నుంచి రూ.60 వరకు విక్రయించడంతో తప్పని పరిస్థితుల్లో మహిళలు కొనుగోలు చేశారు. ఇక దీపావళికి కుటుంబంలోని ప్రతిఒక్కరూ కాల్చే టపాసుల ధరలు చుక్కలను అంటాయి. జీఎస్టీ స్లాబ్‌ల కుదింపుతో టపాసుల ధరలు తగ్గుతాయనుకుంటే దీపావళి, కార్తీక మాసం వ్రతాలు, నోముల కారణంగా వ్యాపారులు ధరలు పెంచి అమ్ముతుండడంతో జనం బెంబేలెత్తిపోతున్నారు.


సూర్యాపేటలోని ఎస్వీ డిగ్రీ కళాశాల మైదానంలో టపాసులు కొంటున్న జనం


ప్రమిదలు కొనుగోలు చేస్తున్న మహిళలు

జాబ్‌మేళాపై విస్తృత ప్రచారం చేయండి

- ఎక్కువ మంది నిరుద్యోగులు హాజరయ్యేలా చూడాలి
- టెలీ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్


టెలీ కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

భానుపురి (సూర్యాపేట) : హుజూర్‌నగర్‌లో ఈనెల 25వ తేదీన నిర్వహించనున్న మెగా జాబ్‌మేళాపై విస్తృత ప్రచారం చేయాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధికారులను ఆదేశించారు. మెగా జాబ్‌మేళా నిర్వహణపై అదనపు కలెక్టర్ కె.సీతారామారావుతో కలిసి సంబంధిత అధికారులతో ఆదివారం సూర్యాపేట కలెక్టరేట్ నుంచి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని నిరుద్యోగ యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్న లక్ష్యంతో రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని తెలిపారు. హుజూర్‌నగర్‌లోని పెర్ల్ ఇన్ఫినిటీ ఇంటర్నేషనల్ స్కూల్ (సబ్ రిజిస్టర్ కార్యాలయం వెనుక)లో ఉదయం 8 గంటల నుంచి జాబ్‌మేళా ప్రారంభమవుతుందన్నారు. ఈ మేళాకు రాష్ట్రంలోని 150 పెద్ద కంపెనీలు రానున్నాయని, 5వేల వరకు నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నాయని ఆయన వెల్లడించారు.

ప్రచారం చేస్తేనే మేలు..

ఈ జాబ్ మేళాకు ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, పీజీ, ఐటీఐ, డిప్లొమా, ఎంబీఏ, బీటెక్, ఫార్మసీ తదితర కోర్సుల్లో ఉత్తీర్ణత కలిగిన 18నుంచి 40 సంవత్సరాల మధ్య వయసున్న నిరుద్యోగ యువత అర్హులని వివరించారు. మేళాపై విస్తృత ప్రచారం నిర్వహిస్తేనే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎక్కువ మంది నిరుద్యోగులు వస్తారన్నారు. అన్ని పట్టణాల్లో జన సంచారం ఎక్కువగా ఉండే ప్రదేశాల్లో ఫ్లెక్సీ బ్యానర్లు, హోర్డింగులు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే జాబ్‌మేళా వాల్‌పోస్టర్లు ముద్రించి బస్సులు, ఇతర వాహనాలకు, కళాశాలల వద్ద అతికించాలని చెప్పారు.

అన్ని సదుపాయాలు కల్పిస్తున్నాం

జాబ్ మేళాకు వచ్చే నిరుద్యోగ యువతకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని, జాబ్‌మేళా నిర్వహించనున్న పెర్ల్ ఇన్ఫినిటీ ఇంటర్నేషనల్ స్కూల్ పక్కనే ఉన్న స్వర్ణ వేదిక ఫంక్షన్ హాలులో ఉదయం అల్పాహారం మొదలుకొని, మధ్యాహ్న భోజనం, అన్ని వసతులు ఏర్పాటు చేస్తామని చెప్పారు. నిరుద్యోగ యువత జాబ్ మేళాకు వచ్చి ఉద్యోగాలు పొందే విధంగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. జాబ్‌మేళాకు హాజరయ్యే వారు 5 సెట్ల రెజ్యూమ్‌తో పాటు ఇటీవలి కాలంలో తీసుకున్న రెండు పాస్ పోర్ట్ సైజ్ ఫోటోగ్రాఫ్‌తో సహా హాజరు కావాలని కోరారు.

22న మంత్రి సమావేశం

జాబ్ మేళా నిర్వహణపై ఈనెల 22 ఉదయం 11 గంటలకు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి సూర్యాపేటలో ఉమ్మడి జిల్లాలోని కళాశాలల ప్రిన్సిపాళ్లు, ఇతర అధికారులతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. సూర్యాపేట, నల్లగొండ, యాదాద్రి భువనగిరి జిల్లాల ఇంటర్మీడియట్ విద్యాధికారులతో సమన్వయం చేసుకొని అంతా హాజరయ్యేలా చూడాలన్నారు. ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు మేళా నిర్వహణపై శ్రద్ధవహించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కె.సీతారామారావు, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, డీఆర్డీఓ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రవాణా శాఖ చెక్‌పోస్టుపై ఏసీబీ దాడులు

కోదాడరూరల్ : కోదాడ మండలం చిమిర్యాల గ్రామ శివారులోని అంతర్‌రాష్ట్ర రవాణా శాఖ చెక్ పోస్టుపై ఏసీబీ అధికారులు శనివారం రాత్రి 12 గంటల నుంచి ఆదివారం ఉదయం 6 గంటల వరకు దాడులు నిర్వహించారు. చెక్ పోస్టులో అక్రమంగా ప్రైవేట్ వ్యక్తులను ఏజెంట్లుగా నియమించుకుని వాహనదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదుల మేరకు ఈ దాడులు నిర్వహించినట్లు తెలుస్తుంది. ఈ దాడుల్లో రికార్డులను పరిశీలించడంతోపాటు అక్కడ వసూలు చేసిన నగదు వాటికి సంబంధించిన ఆన్‌లైన్ వివరాలను పరిశీలించి లెక్కలను సరి చూసినట్లు సమాచారం. చెక్‌పోస్టులో సేకరించిన వివరాలను ఏసీబీ అధికారులు ప్రభుత్వానికి పంపనున్నారు.

'అబ్కారీ' ఆదాయం పెరిగేనా..!

- 23వ తేదీ వరకు మద్యం టెండర్ల గడువు పెంచిన ప్రభుత్వం
- ఇప్పటి వరకు 2,617 దరఖాస్తులు
- టెండర్ ఫీజు అదనంగా రూ.లక్ష పెంపుతో ఆసక్తిచూపని వ్యాపారులు
- గతంలో మాదిరిగా కనిపించని ఉత్సాహం


సూర్యాపేట ఎక్సైజ్ శాఖ కార్యాలయం వద్ద దరఖాస్తులు నింపుతున్న టెండర్‌దారులు

సూర్యాపేటటౌన్ : జిల్లాలో మద్యం దుకాణాలకు టెండర్లు వేసేందుకు ప్రభుత్వం ఈ నెల 23వ తేదీ వరకు గడువు పెంచింది. సెప్టెంబర్ 26నుంచి ఈనెల 18వ తేదీ రాత్రి వరకు మద్యం టెండర్లు స్వీకరించారు. అయితే చివరి రోజు (18వ తేదీన) జరిగిన బీసీ బంద్ నేపథ్యంలో టెండర్లు వేసేందుకు అంతరాయం కలిగింది. దీంతో కొందరు వ్యాపారుల విన్నపం మేరకు ప్రభుత్వం ఈ నెల 23వ తేదీ వరకు టెండర్ల గడువు పొడిగించింది. అలాగే అనుకున్న స్థాయిలో దరఖాస్తులు సైతం రాకపోవడంతో గడువు పెంచినట్టు తెలుస్తోంది. అయితే ప్రభుత్వం గడువు పెంచినా దరఖాస్తులతోపాటు అబ్కారీ శాఖకు ఆదాయం పెరిగేనా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

జిల్లాలో 2,617 దరఖాస్తులు..

జిల్లాలో 93 వైన్స్‌లకు 23 రోజుల వ్యవధిలో అతికష్టం మీద 2,617 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. అదికూడా చివరి రోజు ఈ నెల 18న 1,343 దరఖాస్తులు వచ్చాయి. రాత్రి 11గంటల తర్వాత ప్రభుత్వం దరఖాస్తు గడువు పెంచింది. అయితే 18వ తేదీ వరకు జిల్లాలోని 93 వైన్స్‌లకు 2,716 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో సూర్యాపేట సర్కిల్‌లో 31 వైన్స్‌లకు గాను 846, తుంగతుర్తి సర్కిల్‌లో 17 వైన్స్‌లకు గాను 368 దరఖాస్తులు, కోదాడ సర్కిల్‌లో 21 వైన్స్‌లకు గాను 633 దరఖాస్తులు, హుజూర్‌నగర్ సర్కిల్‌లో 24 వైన్స్‌లకు గాను 770 దరఖాస్తులు వచ్చాయి. అయితే ఇందులో చిలుకూరు మండలం బేతవోలు వైన్స్‌కు అత్యధికంగా 57 దరఖాస్తులు వచ్చాయి. టెండర్ ఫీజు ద్వారా రూ.78.51కోట్ల ఆదాయం వచ్చింది. అయితే గతేడాది 4,338 దరఖాస్తులు రాగా రూ.86.76కోట్ల ఆదాయం సమకూరింది. అయితే ఈ నెల 27న డ్రా పద్ధతిన వైన్స్‌లు కేటాయించనున్నారు.

గత సీజన్‌లోనే పోటీ తీవ్రం

గత సీజన్‌లో మద్యం దుకాణాల కోసం పోటీ తీవ్రంగా ఉంది. ఒక్కో షాపునకు 50కి పైగా టెండర్లు వేశారు. కానీ ఈ సారి ఆ ఉత్సాహం కనిపించడం లేదు. ఈ సారి టెండర్ ఫీజు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షలకు పెంచడంతో వ్యాపారులు ఆసక్తి చూపట్లేదని తెలుస్తోంది. మూడ్రోజుల గడువులోగా ఎన్ని దరఖాస్తులు వస్తాయో వేసిచూడాలి.



ఏపీ ప్రభుత్వ తీరు ప్రజాస్వామ్యానికి చేటు

- పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించడం నిరంకుశత్వం
- ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వం తీరు మార్చుకోవాలంటున్న ప్రజా సంఘాల నాయకులు



భానుపురి (సూర్యాపేట) : ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వం పత్రికలపై వ్యవహరిస్తున్న తీరు ప్రజాస్వామ్యానికే చేటులా ఉంది. ప్రశ్నించే వ్యక్తులు, సంస్థలు, పత్రికలపై కక్షకట్టడం ఏ మాత్రం సహించరానిది. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ సాక్షి దినపత్రిక అవినీతి, అక్రమాలపై నిక్కచ్చిగా వార్తలు ప్రచురిస్తోంది. అలాంటి సాక్షి మీడియాపై ఏపీ సీఎం చంద్రబాబునాయుడు మొదటి నుంచి పక్షపాతంగా వ్యవహరిస్తూ దాడులు చేయించడం తగదు. పత్రికా స్వేచ్ఛను హరించాలని చూడడం అప్రజాస్వామికమని ప్రజాసంఘాల నేతలు అంటున్నారు.

సాక్షి పత్రికపై దాడులు తగవు



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సాక్షి పత్రికపై కక్షసాధింపు చర్యను మానుకోవాలి. అవినీతి, అరాచకాలను వెలికి తీసి వార్తలు రాస్తుందనే నెపంతో సాక్షి పత్రిక, ఎడిటర్‌పై అక్రమ కేసులు బనాయించడం సమంజసం కాదు. ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్య వ్యవస్థకు మంచిది కాదు.

– మద్దెల జ్యోతి, ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి

సాక్షి ఎడిటర్, జర్నలిస్టులపై కేసులు సరికాదు



ప్రజల పాశుపతాస్త్రం సామాన్యుడి ఆయుధం సాక్షి. పత్రిక స్వేచ్ఛను భంగం కలిగించేలా ఏపీలోని కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోంది. ఎడిటర్, ఇతర జర్నలిస్టులపై కేసు నమోదు చేసి వారిని ఇబ్బందులకు గురి చేయటం మంచిది కాదు. ఇప్పటికైనా సాక్షి ఎడిటర్‌పై వేధింపులు మానుకోవాలి.

– బూర వెంకటేశ్వర్లు, సీపీఐ పట్టణ కార్యదర్శి

సాక్షిపై వేధింపులను ఖండిస్తున్నాం



ఆంధ్రాలో కూటమి ప్రభుత్వం సాక్షి ఆఫీసులపై, జర్నలిస్టులపై విచారణ పేరుతో వేధింపులకు పాల్పడడం హేయమైన చర్య. సమాజానికి ఫోర్త్ పిల్లర్‌గా పనిచేస్తున్న మీడియాని అణచివేయాలనుకోవడం వారి అవివేకానికి నిదర్శనం. సాక్షిపై దాడులకు పాల్పడడం సిగ్గుచేటు.

– ఎర్ర అఖిల్‌కుమార్, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

పత్రికా స్వేచ్ఛను హరిస్తే ఊరుకోం



ఏపీలో జరుగుతున్న అవినీతిని బయటపెట్టిన సాక్షి యాజమాన్యాన్ని అభినందించకుండా కక్షసాధింపునకు పాల్పడడం సమంజసం కాదు. పత్రికా స్వేచ్ఛను హరిస్తే ఊరుకునేది లేదు. ప్రశ్నిస్తే వ్యక్తులపైనే కాకుండా మీడియాపై అక్రమంగా కేసులు బనాయిస్తే ప్రజాస్వామ్యం ఏమవుతోంది.

– నల్లగొండ నాగయ్య, పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు



నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

భువనగిరి: భువనగిరి మండలం రాయగిరి గ్రామ పరిధిలోగల మినీ శిల్పారామంలో ఆదివారం శ్రీచంద్ర కళా నిలయం ఆధ్వర్యంలో పెరుమాండ్ల షంతోష్ శిష్య బృందం ఆంధ్ర నాట్య కళా ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. సెలవు దినం కావడంతో శిల్పారామానికి వచ్చిన సందర్శకులు నృత్య ప్రదర్శనను తిలకించి ఆనందించారు. ఈ నృత్య ప్రదర్శనలో కళాకారులు వర్షిక, సుహాని, రితిక, నిత్యశ్రీ, అశ్రిత, దీక్షిత, అక్షిత పాల్గొన్నారు.

తెల్లారితే కేఫ్ ఓపెనింగ్..
అంతలోనే అనంతలోకాలకు..

- వాటర్ ట్యాంక్ కూలి తల్లి, కుమారుడు మృతి
- మాడుగులపల్లి మండల కేంద్రంలో విషాధఛాయలు



భార్య నాగమణి, కుమారుడు విరాట్ కృష్ణ మృతదేహాల వద్ద రోదిస్తున్న తగుళ్ల వెంకన్న

మాడుగులపల్లి: తెల్లారితే కేఫ్ ఓపెనింగ్.. అందుకోసం కేఫ్ నిర్వాహకుడు తన కుటుంబ సభ్యులతో కలిసి ఒక రోజు ముందుగాను కేఫ్ వద్దకు చేరుకుని ఏర్పాట్లు చేసుకుని రాత్రి అక్కడే నిద్రించారు. తెల్లవారుజామున కేఫ్ పైకప్పుపై ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంక్ కూలి కేఫ్ నిర్వాహకుడి భార్య, కుమారుడు మృతిచెందారు. ఈ ఘటన చిట్యాల మండల పరిధిలోని పెద్దకాపర్తి శివారులో జరగగా.. మృతుల స్వస్థలం మాడుగులపల్లి మండల కేంద్రం కావడంతో స్థానికంగా విషాధఛాయలు అలుముకున్నాయి. వివరాలు.. మాడుగులపల్లి మండల కేంద్రానికి చెందిన తగుళ్ల వెంకన్న, నాగమణి(30) దంపతులకు కుమారుడు విరాట్ కృష్ణ(7), కుమార్తె నందిని సంతానం. వెంకన్న రైల్వే శాఖలో గ్యాంగ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. వీరు ఆర్థికంగా ఉన్నతంగా బతకాలన్న ఉద్దేశంతో చిట్యాల మండలం పెద్దకాపర్తి శివారులో విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారి పక్కన నూతనంగా కేఫ్ ఏర్పాటు చేసుకున్నారు. ఆదివారం కేఫ్ ప్రారంభించాలని అనుకుని శనివారం రాత్రి కుటుంబ సభ్యులందరూ కలిసి కేఫ్ వద్దకు వెళ్లి రాత్రి అక్కడే నిద్రించారు. ఆదివారం తెల్లవారుజామున వెంకన్న నిద్రలేచి పనులు చేసుకుంటున్నాడు. అదే సమయంలో కేఫ్ రేకుల పైన ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ ట్యాంక్ అక్కడే నిద్రిస్తున్న వెంకన్న కుటుంబ సభ్యులపై పడిపోయింది. వెంకన్న వెంటనే వారిని ఆస్పత్రికి తరలించగా అతడి భార్య నాగమణి(30), కుమారుడు విరాట్ కృష్ణ(7) అప్పటికే మృతిచెందారు. అతడి కుమార్తె కూతురు నందిని, తల్లి పార్వతమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. పార్వతమ్మను మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని యశోదా ఆస్పత్రికి తరలించారు. మృతిచెందిన నాగమణి, విరాట్ కృష్ణకు నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. గ్రామానికి చేరుకున్న మృతదేహాలను స్థానికులు సందర్శించి కన్నీరుమున్నీరుగా విలపించారు. అనంతరం నాగమణి, విరాట్ కృష్ణ మృతదేహాలకు మాడుగులపల్లిలో అంత్యక్రియలు నిర్వహించారు.

నేత్రదానం..

నాగమణి, విరాట్ కృష్ణ నేత్రాలను దానం చేసేందుకు గాను ఐ డొనేషన్ సెంటర్ వారు నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో కుటుంబ సభ్యులను అవగాహన కల్పించగా.. వారు ఒప్పుకున్నారు. దీంతో నాగమణి, విరాట్ కృష్ణ కంటి కార్నియాను టెక్నీషియన్ బచ్చల కూరి జాని సేకరించారు.

అసమానతలు లేని సమాజం కోసం ఉద్యమించాలి

- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం



మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

రామన్నపేట: అసమానతలు లేని సమాజ నిర్మాణం కోసం యువత ఉద్యమించాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం పిలుపునిచ్చారు. ఆదివారం రామన్నపేటలో నిర్వహించిన యువ కమ్యూనిస్టుల సమ్మేళనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా యువకులతో కలిసి బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం జరిగిన సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. దేశంలో పెట్టుబడిదారీ విధానం వల్ల అసమానతలు పెరుగుతున్నాయని అన్నారు. ఈ ప్రపంచంలో కమ్యూనిజం మహోన్నతమైన సిద్ధాంతమని, కమ్యూనిస్టులు పురోగామిశక్తులు అని చెప్పడానికి శ్రీలంక వంటి పరిణామాలే నిదర్శనమని వివరించారు. పార్టీలు రాజకీయ లబ్ధి కోసం ఆచరణ సాధ్యంకాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక వాటి అమలు కోసం ప్రజలను ఆర్థిక సంక్షోభంలోకి నెట్టేస్తున్నారని విమర్శించారు. ప్రజలకు ఉచిత విద్య, వైద్య అందించినప్పుడే దేశం అభివృద్ధి సాధిస్తుందని చెప్పారు. పార్టీ జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ మాట్లాడుతూ.. యువత దోపిడి వ్యవస్థను నిలువరించాలని, మతోన్మాదశక్తులను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. పార్టీ మండల కార్యదర్శి జెల్లెల పెంటయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమ్మేళనంలో నాయకులు మేక అశోక్‌రెడ్డి, జెల్లెల పెంటయ్య, గడ్డం వెంకటేశం, బల్గూరి అంజయ్య, వనం ఉపేందర్, కూరెళ్ల నర్సింహాచారి, బోయిని ఆనంద్, కందుల హన్మంత్, కల్లూరి నాగేష్, గొరిగె సోములు, నాగటి ఉపేందర్, విజయ్‌భాస్కర్, మీర్‌ఖాజా, బాలరాజు, రామచంద్రం, శ్రవన్, శివ, ఉదయ్ పాల్గొన్నారు.

కాలం చెల్లిన ఇంజెక్షన్ ఇచ్చిన సిబ్బంది సస్పెన్షన్

- ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్ హనుమంతరావు

తుర్కపల్లి: తుర్కపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగికి కాలం చెల్లిన ఇంజెక్షన్ ఇచ్చిన సిబ్బందిని సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ హనుమంతరావు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. తుర్కపల్లి మండలం వాసాలమర్రి గ్రామానికి చెందిన తోలిచుక్క అంజయ్య కాలికి గాయం కావడంతో శనివారం చికిత్స నిమిత్తం పీహెచ్‌సీకి వచ్చాడు. అతడికి పీహెచ్‌సీ సిబ్బంది కాలం చెల్లిన యాంటిబయాటిక్ ఇంజెక్షన్ ఇచ్చారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ ఘటనపై వైద్యాధికారులు విచారణ చేపట్టగా.. ఫార్మసిస్ట్ మహేశ్వరి ఇంజెక్షన్ పరిశీలించకుండానే ఇవ్వగా.. స్టాఫ్ నర్సు రజిత గమనించకుండానే రోగికి ఇంజెక్షన్ ఇచ్చినట్లు నిర్ధారణ అయ్యింది. దీంతో స్టాఫ్ నర్సు రజిత(కాంట్రాక్ట్), ఫార్మసిస్ట్ మహేశ్వరి(అవుట్ సోర్సింగ్)ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. వైద్య సేవల్లో నిర్లక్ష్యాన్ని సహించబోమని కలెక్టర్ హనుమంతరావు స్పష్టం చేశారు. వైద్య సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని ఆయన సూచించారు.

22 నుంచి కార్తీక పూజలు

- యాదగిరి క్షేత్రంలో ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు
- వ్రత మండపంలో పీటలు, ప్రసాదాలు రెడీ



వ్రత మండపంలో సిద్ధం చేస్తున్న వ్రత పీటలు

యాదగిరిగుట్ట: యాదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈ నెల 22వ తేదీ నుంచి నవంబర్ 20వ తేదీ వరకు కార్తీక మాసం ఉత్సవాలను నిర్వహించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. తెలంగాణాతో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన భక్తులు అధికంగా యాదగిరి క్షేత్రంలో ఈ కార్తీక మాసంలో శ్రీసత్యనారాయణస్వామి వ్రతాలు జరిపించేందుకు ఆసక్తి కనబరుస్తారు. వ్రత పూజల్లో పాల్గొనేందుకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొండ దిగువన ఉన్న సత్యనారాయణస్వామి వ్రత మండపంలోని రెండు హాళ్లలో పూజ సామాగ్రి, వ్రత పీటలను, వ్రతంలో ఉపయోగించే ప్రసాదాలను ప్యాకింగ్ చేసి సిద్ధం చేశారు. యాదగిరి ఆలయానికి అనుబంధంగా ఉన్న పాతగుట్టలో సైతం భక్తులు వ్రతాలను జరిపించేందుకు ఏర్పాట్లు చేశారు.

యాదగిరి క్షేత్రంలో..

యాదగిరి క్షేత్రంలో నెల రోజుల పాటు 6 బ్యాచ్‌లుగా వ్రతాలను నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. మొదటి బ్యాచ్ ఉదయం 7గంటల నుంచి 8గంటల వరకు, రెండో బ్యాచ్ ఉదయం 9గంటల నుంచి 10 గంటల వరకు, మూడో బ్యాచ్ 11గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, నాల్గవ బ్యాచ్ మధ్యాహ్నం 1గంటల నుంచి 2గంటల వరకు, ఐదో బ్యాచ్ మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు, ఆరో బ్యాచ్ సాయంత్రం 5గంటల నుంచి 6గంటల వరకు నిర్వహించనున్నారు.

పాతగుట్ట ఆలయంలో..

యాదగిరీశుడి అనుబంధ ఆలయమైన పాతగుట్ట లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో నాలుగు బ్యాచ్‌లుగా వ్రతాలు నిర్వహిస్తామని అధికారులు పేర్కొన్నారు. మొదటి బ్యాచ్ ఉదయం 9గంటలకు, రెండో బ్యాచ్ 11గంటలకు, మూడో బ్యాచ్ మధ్యాహ్నం 2గంటలకు, నాల్గవ బ్యాచ్ సాయంత్రం 4గంటలకు నిర్వహిస్తారు.

కార్తీక పౌర్ణమి రోజు..

వచ్చే నెల 5వ తేదీన కార్తీక శుద్ధ పూర్ణిమ నేపథ్యంలో యాదగిరి కొండకు దిగువన ఉన్న సత్యనారాయణస్వామి వ్రత మండపంలో ఉదయం 5గంటల నుంచి రాత్రి 7గంటల వరకు 8 బ్యాచ్‌లుగా వ్రతాలు నిర్వహించనున్నారు. ప్రతి గంటకు ఒక్క బ్యాచ్ చొప్పున 8 బ్యాచ్‌లు నిర్వహిస్తామని ఇప్పటికే ఆలయ ఈఓ రవినాయక్ వెల్లడించారు. కాగా పాతగుట్ట ఆలయంలో 6 బ్యాచ్‌లుగా వ్రతాలను భక్తులచే జరిపిస్తారు.

అప్రమత్తంగా ఉంటేనే ఆనంద కేళి..

- టపాసులు కాల్చేటప్పుడు సరైన జాగ్రత్తలు పాటించాలి



పెద్దవూర: వెలుగులు విరజిమ్మే దీపావళి రానే వచ్చింది. పండుగ రోజున టపాసులు పేల్చేవారు తగిన జాగ్రత్తలు తీసుకుంటే ఆనందకేళీ అవుతుంది.

వ్యాపారులు పాటించాల్సిన జాగ్రత్తలు

- టపాసుల దుకాణదారులు అధికా రుల నుంచి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలి.
- దుకాణాలను బహిరంగ మైదా నాలు, అధికారులు సూచించిన స్థలాల్లోనే ఉండాలి.
- దుకాణాల వద్ద ఎల్ఈడీ లైట్లను ఏర్పాటు చేసుకోవాలి.
- ప్రమాదాల నివారణకు నీటిని, ఇసుకను అందుబాటులో ఉంచుకోవాలి.
- వినియోగదారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రతి దుకాణదారుడు కరపత్రాలను అందజేయాలి.
- దుకాణానికి అనుమతి గడువు తీరిన అనంతరం టపాసులను సంబంధిత అధికారికి అప్పగించాలి.

కాల్చేటప్పుడు జాగ్రత్తలు

- అనుమతులు ఉన్న దుకాణాల్లోనే టపాసులను కొనుగోలు చేయాలి.
- పెద్దల సమక్షంలోనే చిన్న పిల్లల చేత పటాకులు కాల్పించాలి.
- టపాసులు కాల్చేటప్పుడు తప్పనిసరిగా నీళ్లు, ఇసుకను అందుబాటులో ఉంచుకోవాలి.
- టపాసులు కాల్చే సమయంలో బిగుతుగా ఉండే కాటన్ దుస్తులు ధరించాలి.
- పొరపాటున దుస్తులకు నిప్పు అంటుకుంటే అటూ ఇటూ పరిగెత్తకుండా ఉన్న చోటే కింద పడుకుని దొర్లాలి. అలా చేయడం వలన నిప్పు త్వరగా ఆరిపోతుంది.
- ఇంట్లో కిరోసిన్, గ్యాస్ సిలిండర్ల వద్ద టపాసులను నిల్వ ఉంచకూడదు.
- సగం కాలిన టపాసులను మళ్లీ కాల్చే ప్రయత్నం చేయరాదు.
- బాణసంచా కాల్చిన తర్వాత సబ్బుతో చేతులను శుభ్రంగా కడుక్కోవాలి.
- టపాసులను సొంతంగా తయారు చేసే ప్రయత్నం చేయరాదు.
- బాణసంచా పేలుళ్ల వలన వినికిడి సమస్యతో పాటు అధిక రక్తపోటు, గుండెపోటుకు గురయ్యే ప్రమాదం ఉంది.

రసాయనాలు.. వాటి ప్రభావం..

చైనా టపాసుల్లో పొటాషియం క్లోరైడ్‌ను ఎక్కువగా వినియోగిస్తారు. వీటిని పేల్చగానే ఒకేసారి పొగ ఊపిరితిత్తుల్లోకి వెళ్లి మనిషిని అనారోగ్యం పాలు చేస్తుంది. టపాసుల్లో ఉపయోగించే రసాయనాలు పీల్చడం వలన కలిగే దుష్పలితాలు..

రాగి: శ్వాస నాళాల్లో మంట వస్తుంది.
కాడ్మియం: రక్తహీనత, మూత్రపిండాలు దెబ్బతింటాయి
సీసం: నాడీ వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతుంది
మెగ్నీషియం: మెగ్నీషియం ధూళి కారణంగా జ్వరం వస్తుంది.
సోడియం: చర్మవ్యాధులు వస్తాయి
జింక్: వాంతులు వస్తాయి
నైట్రేట్: మానసిక స్థితి అదుపు తప్పుతుంది.

చిన్నపిల్లలు, గర్భిణులు దూరంగా ఉండాలి



టపాసులు కాల్చే సమయంలో తల్లిదండ్రులు తమ పిల్లల దగ్గర ఉండాలి. పెద్దపెద్ద శబ్దాలు వచ్చే బాంబులను కాల్చకపోవడమే మంచిది. సాధారణంగా మన చెవులు 50 డెసిబుల్ శబ్దాలను మాత్రమే తట్టుకుంటాయి. బాణసంచా పేల్చుడు వలన 70 డెసిబుల్స్ దాటితే చిన్న పిల్లలకే కాదు పెద్దలకు కూడా చెవుడు వచ్చే ప్రమాదం ఉంది. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు టపాసులకు దూరంగా ఉండటమే మంచిది.

– డాక్టర్ నగేష్, మండల వైద్యాధికారి, పెద్దవూర

సూక్ష్మ సైజులో పోలీసు అమరవీరుల స్థూపం



వెండితో తయారు చేసిన పోలీసు అమరవీరుల స్థూపం

భువనగిరి : భువనగిరి పట్టణానికి చెందిన స్వర్ణకారుడు చోల్లేటి శ్రీనివాసచారి ఈ నెల 21న పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని సూక్ష్మ సైజులో పోలీసు అమరవీరుల స్థూపాన్ని తయారు చేశారు. 40 గ్రాముల వెండితో నాలుగు ఇంచుల ఎత్తులో రూపొందించి ఔరా అనిపించారు. ఆయన గతంలోనూ బంగారం, వెండితో వీసా టవర్, క్రికెట్ స్టేడియం, క్రికెట్ వరల్డ్ కప్, భారత పార్లమెంటు భవనం, వీణ, బంగారు బతుకమ్మ, తెలంగాణ చిత్రపటం, ఫుట్‌బాల్ వరల్డ్ కప్, క్రికెట్ బాల్ వంటివి తయారు చేశాడు.



శ్రీనివాసచారి

దీపావళి వెలుగులు నింపాలి

- శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



నల్లగొండ: నల్లగొండ జిల్లా ప్రజలకు శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ దీపావళి పండుగ ప్రతిఒక్కరి జీవితంలో వెలుగును నింపాలని కోరుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ప్రజలంతా దీపావళిని ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

నేడే దీపావళి పండుగ



వేణుగోపాల రావు

రామగిరి(నల్లగొండ): దీపావళి పండుగను సోమవారమే జరుపుకోవాలని నిర్ణయించినట్లు అఖిల బ్రాహ్మణ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొల్లా వేణుగోపాలరావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 20న నరకచతుర్ధశి నివాళులు, 21న ధనలక్ష్మి పూజలు జరుపుకోవాలని ఆయన అన్నారు. అమావాస్య ఘడియలు సోమవారం మధ్యాహ్నం 3.46 నుంచి మంగళవారం సాయంత్రం 5.56 నిమిషాల వరకు ఉన్నందున నోములు సోమవారం, మంగళవారం రెండు రోజులు జరుపుకోవచ్చని సూచించారు. ఈసారి కొత్త నోములు లేవని పాత వారు కేదారిశ్వరి వ్రతం చేసుకోవాలన్నారు. సోమవారం నివాళులు ఇచ్చుకోవాలని పేర్కొన్నారు.